క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కె.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ కొహెడ ఫీడర్ పరిధిలోని శాంతి నగర్, బ్యాంక్ కాలనీ, సదాశివకాలనీ, సాయి నగర్, పెద్దఅంబర్‌పేట ఎక్స్‌రోడ్డు, పరిసర కాలనీల్లో ఈ అంతరాయం ఉంటుందన్నారు.

రోడ్డు పనులు ప్రారంభించండి

బీజేపీ ఫ్లోర్ లీడర్ వై.శివకుమార్

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల వండర్‌లా నుంచి ఆర్‌సీఐ సీపీటీసీ వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తుక్కుగూడ మున్సిపాలిటీ బీజేపీ ఫ్లోర్ లీడర్ వై.శివకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన రావిర్యాలలో మాట్లాడుతూ.. ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డు విస్తరణ పేరుతో రోడ్డును చదును చేసి కంకర పోసి వదిలేయడంతో రెండు నెలలుగా వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నిత్యం వందలాంది మంది ప్రయాణం చేసే రోడ్డు పనుల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని రోడ్డు పనులు త్వరగా పూర్తి అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. త్వరితగతిన పనులు ప్రారంభించకుంటే ఆందోళన చేపడ్తామని హెచ్చరించారు.

నాభిశిల పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలకు ఆహ్వానం



మంత్రి సబితారెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని ఇమామ్‌గూడ (లక్ష్మీనగర్) గ్రామంలో ఈ నెల21 నుండి 24వరకు నిర్వహించే బొడ్రాయి (నాభిశిల) పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం ఉత్సవ కమిటీ సభ్యులు విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్‌లను నగరంలో కలిసి వారికి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామాలయ దేవాలయం చైర్మన్ నిమ్మగూడెం నర్సింహగౌడ్, ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జీటీ గోపాల్‌రావుకు పరామర్శ

బడంగ్‌పేట్: అలిండియా డిఫెన్స్ ఉద్యోగుల నాయకుడు కామ్రేడ్ జీటీ.గోపాల్‌రావు ఇటీవల క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఆయనకు శస్త్ర చికిత్స చేసి 40శాతం నాలికను తొలగించారు. విషయం తెలుసుకున్న కామ్రేడ్లు బడంగ్‌పేటలోని గోపాల్‌రావు ఇంటికి చేరుకుని పరామర్శించారు. ఈ సందర్భంగా కామ్రేడ్లు మాట్లాడుతూ.. ఉద్యోగంలో ఉన్నప్పుడు తర్వాత కాలంలోనూ పూర్తిగా డిఫెన్స్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేసిన జీటీ గోపాల్‌రావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో సీపీఎం రాష్ట్ర సెక్రెటేరియట్ మెంబర్ డీజీ నరసింహరావు, రాష్ట్ర నాయకులు ప్రసాద్, సీపీఎం నాయకులు కిషోర్ తదితరులు ఉన్నారు.

డిమాండ్లు పరిష్కరించే వరకు ఉద్యమం



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వీఓఏలు

కందుకూరు: సమస్యల పరిష్కారం కోరుతూ సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజు ఆధ్వర్యంలో మండల కార్యాలయాల ఆవరణంలో వీఓఏలు చేపట్టిన సమ్మె బుధవారంతో 31వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు ఉద్యమాన్ని ఆపేదిలేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఓఏలు పాల్గొన్నారు.

వైభవంగా శిఖర స్థాపన

ఆమనగల్లు: పట్టణంలోని విద్యానగర్ కాలనీలోని అభయాంజనేయస్వామి ఆలయంలో బుధవారం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శిఖర స్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గూడ కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు రాధాకృష్ణ, అప్పన్న, వరప్రసాద్ శాస్త్రిల సహకారంతో పూజలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆలయంలో హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. పూజా కార్యక్రమాల్లో సంఘ సేవకుడు పాపిశెట్టి రాము, నాయకులు లింగయ్య, రామ్మోహన్, నర్సింహ, నయనాచారి, శివలింగం, వెంకటయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.



కోమటికుంట చెరువులోకి వరదలా వస్తున్న మురుగు



కుంటను తలపిస్తున్న మురుగు

నత్తనడకన 'సుందరీకరణ'

కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన కోమటికుంట సుందరీకరణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. పనులు చేపట్టడంలో అలసత్వం వహించడంతో చెరువు ప్రాంతమంతా కళావిహీనంగా తయారైంది. డ్రైనేజీల నుంచి వచ్చే మురుగు కుంటగా మారి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

- రోడ్లపై పారుతున్న మురుగు
- అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి అల్మాస్‌గూడలోని కోమటికుంట చెరువు సుందరీకరణ పనులు చేపట్టారు. ఇందుకు నిధులు సైతం మంజూరయ్యాయి. పనులు చురుగ్గా ప్రారంభించినా ఒక్కసారిగా నిలిచిపోయాయి. గతంలో మురుగు చెరువులోకి వెళ్లేలా పైప్‌లైన్లు వేశారు. సుందరీకరణ పనుల్లో భాగంగా కోమటికుంట చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు కట్టను నిర్మిస్తున్నారు. దీంతో మురుగు వెళ్లే దారిలేక కుంటగా తయారైంది. అల్మాస్‌గూడలో కోమటికుంట చెరువు బ్యూటిఫికేషన్ చేసేందుకు అధికారులు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. దీంతో సుమారు రూ.3కోట్ల నిధులు మంజూరయ్యాయి. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు నత్తనడకన చేపడుతున్నాడు. అల్మాస్‌గూడ పంచాయతీ, నగర పంచాయతీగా ఉన్న సమయంలో 60గజాల ఇళ్లు, వైఎస్ నగర్ ఫేస్–1,2,3, జయశంకర్ నగర్ కాలనీ, రాజీవ్ గృహకల్ప, విశాఖనగర్ కాలనీ, శ్రీశ్రీ హోమ్స్ గేటెడ్ కమ్యూనిటీ, ఓ ఫంక్షన్‌హాల్‌కు సంబంధించిన మురుగుతో పాటుగా.. మరో 15 కాలనీలకు చెందిన మురుగు చెరువులోకి వదిలేందుకు పైప్‌లైన్లు వేశారు. జనాభా పెరగడంతో మురుగు ఉధృతి పెరిగింది. సుందరీకరణ పనుల్లో భాగంగా చేపట్టిన వాకింగ్ ట్రాక్ నిర్మిస్తుండడంతో మురుగు వెళ్లే దారిలేక అల్మాస్‌గూడ, రాజీవ్ గృహకల్ప మార్గంలో మురుగంతా ఓ కుంటలా తయారైంది. దీంతో అటుగా వెళ్లే ప్రయాణికులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. చుట్టు పక్కల ఉన్న వారు రాత్రిళ్లు నిద్రపోలేకపోతున్నామని.. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

దుర్వాసన భరించలేకపోతున్నాం



చెరువుల అభివృద్ధికి సుందరీకరణ పనులు చేపట్టడం అందరికీ ఆమోదమే. కానీ డ్రైనేజీ వెళ్లే మార్గం లేకుండా అభివృద్ధి చేయడం సరికాదు. డ్రైనేజీ అంతా ఒక చోట చేరి కుంటలా తయారైంది. దీని నుంచి వచ్చే దుర్వాసన భరించలేకపోతున్నాం. ఇప్పటికైనా అధికారులు మురుగు వెళ్లే మార్గం చూపాలి.

– బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, అల్మాస్‌గూడ

మూణ్నాళ్ల ముచ్చట !



నేదునూరులో ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.30లక్షలతో అక్టోబర్ 2020లో నిర్మించిన సీసీ రహదారి కట్టు కాల్వ ఉన్న ప్రాంతంలో ధ్వంసమైంది. రహదారి నిర్మించిన రెండున్నర ఏళ్లకే పాడవడంతో స్థానికులు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. - కందుకూరు

భూ నిర్వాసితులకు పరిహారం ఇవ్వండి

ఆమనగల్లు: కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డీ–82 కాల్వ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించాలని పోలేపల్లి, సింగంపల్లి రైతులు బుధవారం మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఏళ్ల క్రితం కాల్వ నిర్మాణంలో భూములు కోల్పోయామని ప్రభుత్వం భూములు స్వాధీనం చేసుకున్నా నేటికీ పరిహారం అందించలేదని మంత్రికి వివరించారు. వెంటనే పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు ఆమె సానుకూలంగా స్పందించినట్లు రైతులు తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో గాయత్రినగర్ కార్పొరేటర్ ఓం ప్రకాశ్, పోలేపల్లి ఉప సర్పంచ్ అంజన్‌రెడ్డి, రైతులు, నాయకులు భగవాన్‌రెడ్డి, జగ్‌రామ్, శేఖర్‌గౌడ్, రాజు, వీరాసింగ్ తదితరులున్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

సీఎంఆర్ఎఫ్.. పేదలకు వరం

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

యాచారం: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంగా మారిందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తక్కళ్లపల్లి తండాకు చెందిన రమావత్ భాస్కర్ కుమారుడు అఖిల్ అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి వైద్య ఖర్చులకు ఎమ్మెల్యే సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.2లక్షల ఎల్ఓసీను బుధవారం ఇబ్రహీంపట్నం క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏడేళ్లలో నియోజకవర్గంలో రూ.15కోట్ల వరకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో తక్కళ్లపల్లి తండా సర్పంచ్ జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

'పేదలకు అండగా బీఆర్ఎస్'

మంచాల: బీఆర్ఎస్ పేదలకు అండగా ఉంటుందని పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బహదూర్ అన్నారు. మండల పరిధిలోని ఎల్లమ్మ తండాకు చెందిన సపావట్ వనిత అనారోగ్యంతో చికిత్స పొందుతోంది. ఆమె వైద్య ఖర్చులకు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి సీఎంఆర్ఎఫ్‌కు సిఫారసు చేయంగా రూ.2.50లక్షల ఎల్ఓసీ మంజూరైంది. ఈ మేరకు బుధవారం బాధితురాలి కుటుంబ సభ్యులకు ఎల్ఓసీ అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు వనపర్తి భద్రీనాథ్ గుప్తా, నాయకులు యాదగిరి, ప్రకాశ్ రెడ్డి, జగదీశ్ పాల్గొన్నారు.



యాచారం: ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

పరిశ్రమలకు వేదికగా ఆమనగల్లు

కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా పనులు చేపడుతున్నామని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. బుధవారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులలో టీయూఎఫ్ఐడీసీ రూ.15కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో రూ.102 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ప్రజల భాగస్వామ్యంతో ఆదర్శ మున్సిపాలిటీ తీర్చిదిద్దుతామన్నారు. ఆమనగల్లు ఆస్పత్రిని సీహెచ్‌సీగా 30 పడకలకు పెంచామని, త్వరలోనే భవన నిర్మాణ పనులు చేపడతామన్నారు. ఆమనగల్లుకు వ్యవసాయ శాఖ ఏడీఏ కార్యాలయం మంజూరైందని త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. మండల పరిధిలోని విఠాయిపల్లి మధ్య నుంచి త్వరలోనే ఆర్ఆర్ఆర్ రోడ్డు పనులు ప్రారంభమవుతాయని దీంతో పరిశ్రమల ఏర్పాటుకు ఆమనగల్లు వేదిక కానుందన్నారు. దీంతో నిరుద్యోగులకు, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు కృష్ణ, సుజాత, విక్రంరెడ్డి, కృష్ణయాదవ్, జ్యోతి, దివ్య, విజయ్‌కృష్ణ, రాధమ్మ, వెంకటయ్య, సోనిజయరాం, చెన్నకేశవులు, ఝాన్సీ, యాదయ్య, ఏఈ భార్గవ్, డీఈ యాదయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్‌రావు, నాయకులు నిరంజన్‌గౌడ్, ఖలీల్, మాసుం, బాలకృష్ణ, రామకృష్ణ, రఘు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

జెడ్పీటీసీ సభ్యుడు దశరథ్‌నాయక్

కడ్తాల్: కంటి సమస్యలతో బాధపడేవారు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు దశరథ్‌నాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చరికొండ గ్రామంలో ఆయన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, వైద్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భారతమ్మ, ఎంపీటీసీ సభ్యుడు రాములుగౌడ్, రైతుబంధు మండల కోఆర్డినేటర్ వీరయ్య, నాయకులు నర్సింహగౌడ్, యాదయ్య, వైద్యులు సంపూర్ణదేవి, సుధీర్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాతకోటతండాలో..

తలకొండపల్లి: మండల పరిధిలోని పాతకోటతండాలో బుధవారం సర్పంచ్ అలివేలు కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దృష్టి లోపాలున్నవారికి అద్దాలు ఉచితంగా పంపిణీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జీరానాయక్, గోపినాయక్, శ్రీను, ఉప సర్పంచ్ పద్మ, గురుసింగ్, కార్యదర్శి రమేశ్, మెడికల్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

అపిల్ అవెన్యూ కాలనీలో..

తుర్కయంజాల్: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధి ఇంజాపూర్‌లోని 24వ వార్డు ఆపిల్ అవెన్యూ కాలనీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ప్రజలు ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకట్‌రెడ్డి, డాక్టర్ ఐ.వంశీధర్, నాయకులు ధన్‌రాజ్‌గౌడ్, కాలనీ వాసులు ప్రభాకర్‌రెడ్డి, రమణ విశ్వం, శివరాం, రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ పనులు ప్రారంభం

తుర్కయంజాల్: వార్డు అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నానని కమ్మగూడ 18వ వార్డు కౌన్సిలర్ సునీల్ అన్నారు. బుధవారం కమ్మగూడలోని వశిష్ఠ ఎన్‌క్లేవ్ ఫేజ్–3లో అంతర్గత డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం కాలనీ వాసులు కౌన్సిలర్‌ను ఘనంగా సన్మానించారు. కాలనీ వాసులు బద్రు, దశరథ, శ్రీకాంత్, మల్లేశ్, రాము తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత పాటించిన ధాన్యానికి మద్దతు ధర

మండల వ్యవసాయశాఖ అధికారి అరుణకుమారి

ఆమనగల్లు: నాణ్యత ప్రమాణాలు పాటించిన ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందని మండల వ్యవసాయశాఖ అధికారి అరుణకుమారి అన్నారు. బుధవారం ఆమె పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడారు. ధాన్యంలో తేమ 17శాతం, చెత్త తాలు 1శాతం, రాళ్లు, మట్టిపెళ్లలు, రంగు మారిన ధాన్యం 5శాతం, పూర్తిగా తయారు కాని ధాన్యం 3శాతం ఉండాలని రైతులకు సూచించారు. ఆమె వెంట వ్యవసాయ విస్తరణ అధికారి రాణి, రైతులు ఉన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలతో సమాజ శాంతి

జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి

ఆమనగల్లు: ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజ శాంతికి దోహదపడుతాయని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రతిభానగర్ కాలనీకి చెందిన లలితా జంగయ్య యాదవ్‌ల ఆధ్వర్యంలో నిర్మించిన శివలింగ, నందీశ్వర, ఎల్లమ దేవత, మల్లికార్జున స్వామి, బలిపీఠ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లతో కలిసి ఆచారి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ వ్యవస్థాపకులు లలితా జంగయ్య యాదవ్‌ల ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులను, నాయకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఝాన్సీ, సుజాత, రాములు, కృష్ణనాయక్, విక్రం రెడ్డి, కృష్ణయ్య యాదవ్, జ్యోతి, నర్సింహ, సోని, శ్రీశైలం, యాదమ్మ, లక్ష్మణ్, చెన్నకేశవులు, రాంరెడ్డి, టిల్లుయాదవ్ పాల్గొన్నారు.

23 వరకు పారిశుద్ధ్య పనులు

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి



పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. తెలంగాణ పంచాయతీ రాజ్, ఉపాధి కల్పన కమిషనర్ అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు ఆయన బుధవారం పారిశుద్ధ్య పనులకు శ్రీకారం చుట్టారు. పలు కాలనీల్లో పారిశుద్ధ్య పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ.. ఈ నెల 23 వరకు పారిశుద్ధ్య పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ లాయక్‌అలీ, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, ఉప సర్పంచ్ రామకృష్ణ, వార్డు సభ్యులు నరేందర్‌రెడ్డి, మహేశ్, నాయకులు అశోక్, వెంకటయ్యగౌడ్, యాదయ్య, జంగయ్య, కార్యదర్శి రాఘవేందర్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సన్మానం

ఇబ్రహీంపట్నం: స్పెషల్ గ్రేడ్ ప్రమోషన్ పొందిన ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ యూసుఫ్‌ను చైర్ పర్సన్ కప్పరి స్రవంతి బుధవారం సన్మానించారు. మున్సిపల్ సిబ్బందితో కలిసి పదోన్నతి పొందిన యూసుఫ్‌కు శాలువ కప్పి అభినందనలను తెలిపారు.



కమిషనర్‌ను సన్మానించిన స్రవంతి

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ విజయపురి కాలనీ ఫేజ్–2లోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయ 21 వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సాయిబాబా ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని కార్పొరేటర్ లచ్చిరెడ్డి కోరుకున్నారు. అనంతరం ఆయన ఆలయ అర్చకుల గృహనిర్మాణం కోసం రూ.25 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఆలయ చైర్మన్ సోమిశెట్టి మోహన్, నాయకులు విష్ణువర్ధన్‌రావు, సాయి రాం, పర్వతరెడ్డి, గోపాల్‌రెడ్డి, కనకరాజు, ప్రసాద్, రమణ, శైలేష్, అంజనేయరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా కాలనీల అభివృద్ధి



కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తానని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో బుధవారం ఆయన కాలనీ వాసులతో కలిసి పర్యటించి కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ రణధీర్, కాలనీ అధ్యక్షుడు రాముగౌడ్, నాయకులు శేఖర్, జ్ఞానేశ్వర్, ఉపేందర్, వెంకట్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా మధుసూదన్ గుప్తా

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా నీల మధుసూదన్ గుప్తా నియమితులయ్యారు. బుధవారం హస్తినాపురంలోని పిండి నారాయణ రెడ్డి కాలనీలో జరిగిన కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా బిజ్జాల వేణుగుప్తా, కోశాధికారిగా బండారు సుధాకర్‌గుప్తా, ఉపాధ్యక్షుడిగా శవ్వ యాదగిరి గుప్తా, సంయుక్త కార్యదర్శిగా ఎర్రం భాస్కర్‌గుప్తా నియమితులయ్యారు. ఆర్య వైశ్యుల సమస్యల పరిష్కారానికి తన శాయశక్తులా కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు నీల మధుసూదన్‌గుప్తా అన్నారు.



నియామకపత్రం అందుకుంటున్న నీల మధుసూదన్ గుప్తా